క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

ప్యాపిలి: మండల పరిధిలోని మెట్టుపల్లిలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చిన్నప రెడ్డి శుక్రవారం తన తల్లి ధర్మన్నగారి సుభాషిణి జ్ఞాపకార్థం విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేశారు. హెచ్‌ఎం రవీంద్ర గుప్త ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిల్లు, డ్రాయింగ్, కాపీ రైటింగ్ పుస్తకాలు, క్రీడా వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, శివ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్యాపిలి: ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారిణి వాణిశ్రీ సూచించారు. స్థానిక కస్తూర్బా విద్యాలయంలో శుక్రవారం విద్యార్థినులకు వైద్యసిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 242 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న ముగ్గురిని డోన్ ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. అనంతరం వైద్యాధికారిణి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు అతిసారా, డెంగీ, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులు దోమల ద్వారానే వ్యాప్తి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది జయలక్ష్మి, మల్లేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి

కోవెలకుంట్ల: ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాలిథిన్ కవర్లు, క్యారీబ్యాగులకు బదులుగా పేపర్‌తో తయారు చేసిన బ్యాగ్‌లను వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి, అన్నపూర్ణ, రాజు, భాస్కర్ నాయక్, నాగేశ్వరరెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

బేతంచెర్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని హనుమాన్ నగర్ జెడ్పీ హైస్కూలు ఆవరణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా విద్యార్థులకు మొక్కల ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు సత్తార్, మాణిక్యం, అక్తాబ్, రామూర్తి, మగ్బుల్, అహ్మద్ హుసేన్, గణేష్ రెడ్డి పాల్గొన్నారు.

పాడిరైతులు జాగ్రత్తలు పాటించాలి

సంజామల: రైతులు, పాడిరైతులు పశుగ్రాసం సాగులో జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధ కశాఖ ఏడి డాక్టర్ మోహన్ రావు సూచించారు. మండల పరిధిలోని గిద్దలూరు గ్రామంలో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సౌకర్యం ఉన్న పాడిరైతులు పచ్చి మేతను సాగు చేసుకోవాలని, పాడిపశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు శివనందారెడ్డి, రఘు, పశువైద్య సిబ్బంది మహబుబ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలి

బేతంచెర్ల: రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రవి ప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం రంగాపురం గ్రామంలో సాగు చేసిన పండ్ల తోటలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగు చేసుకునే అవకావం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, కంప్యూటర్ ఆపరేటర్లు రామకృష్ణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

ప్యాపిలి: ప్రజలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా అబ్దుల్ లతీఫ్ మాట్లాడుతూ మూఢ నమ్మకాలు, ఛాందస భావాలకు దూరంగా ఉండాలన్నారు. జీవ వైవిధ్య పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మెట్ట సాగు... లాభాలు బాగు !

- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు
- వేరుశనగ అంతర్‌పంటగా కందిసాగు లాభదాయకం

బనగానపల్లె : ఖరీఫ్ సాగు ఊపందుకుంది. వ్యవసాయ పనుల్లో రైతన్నలు బిజీ అయ్యారు. జూలై 1న ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవ్వగా పంట పొలం తీరు మేరకు ఆగస్టు 15వ తేదీ వరకు సాగుకు అనుకూలమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అయితే ఖరీఫ్‌లో మెలకువలు పాటిస్తే మెట్టసాగు పంటలు దిగుబడులు సాధించవచ్చు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే అవకాశాలు ఉన్నాయి. వర్షాలు సక్రమంగా కురుస్తే వేరుశనగ, పత్తి, కంది తదితర పంటలు లాభాలు కురిపిస్తాయి. వేరుశనగ పంటతోపాటు కంది అంతర్‌పంటగా వేసుకుంటే అన్నివిధాలుగా కలిసి వస్తుందని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. మెట్ట సాగులో పాటించాల్సిన మెలుకువలను ఆయన వివరించారు.



పత్తిపంట(ఫైల్)

వేరుశనగ పంట : వర్షాధారంగా సాగుచేసే వేరుశనగను లావుగింజరకాలైతే ఎకరానికి 52కిలోలు, సన్నగింజ 40 కిలోలు చొప్పున విత్తాలి. కిలో విత్తనానికి 3 గ్రాములు మాంకోజబ్బు కలిపి విత్తన శుద్ధి చేయాలి. వర్షంపడిన వెంటనే నేలలో తేమ ఆరిపోకుండా వేరుశనగ విత్తుకోవాలి. భూసార పరీక్షల ఆధారంగా రసాయన ఎరువులువాడాలి. నేలలో లభ్యమయ్యే పోషకాలు తక్కువగా ఉంటే సిఫారసు మేరకు మందులు వాడాలి. జింక్ లోపం గమనిస్తే లీటర్ నీటికి 2 గ్రాములు, జింక్‌సల్ఫేట్ ఇనుపధాతు లోపం గమనిస్తే ఐదు గ్రాములు, గ్రాము నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలి. పంటలో కలుపు మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు తీసివేయాలి.

పత్తి : ఎర్రనేలల్లో ఈ నెల చివరి వరకు, నల్లరేగడి నేలలో ఆగస్టు 15 వరకు ఈ పంటను విత్తుకునేందుకు అనుకూలం. దేశీయ ఇతర రకాలు హైబ్రిడ్ రకాలను విత్తుకోవాలి. ఎకరానికి దేశీయ రకాలకు 4-5కిలోలు, అమెరికన్ పత్తి రకాలకు రెండు కిలోలు, హైబ్రిడ్ రకాలకు 750 గ్రాముల నుంచి కిలో విత్తనాలను తొలకరి తరువాత కనీసం 75 మిమీ వర్షంపడిన తరువాత నేలలో సరైన తేమ ఉన్నప్పుడు నాటుకోవాలి. ఎకరానికి 4-5 టన్నుల పశువుల ఎరువు, 100-125 కిలోల యూరియా, 150 కిలోల సూపర్‌ఫాస్పేట్, 40-50కిలోల పోటాష్ ఎరువులను వేసుకోవాలి. మొత్తం సూపర్‌ఫాస్పేట్ ఆకరి దుక్కులో వేయాలి. యూరియా పోటాష్ ఎరువులను 4 సార్లుగా విత్తిన 20-90రోజుల్లోపు భూమిలో తేమ ఉన్నప్పుడు వేసుకోవాలి. సకాలంలో కలుపును మందులతోగాని అంతర కృషి ద్వారాగాని నివారించుకోవాలి. ప్రతికూలపరిస్థితుల్లోనూ పూతపిందే రాలకుండా క్రిమిసంహారక మందులను వినియోగించాలి. సమగ్ర సస్యపద్ధతులను పాటించి పంటకు నష్టం కలిగించే పురుగులను అదుపులో ఉంచాలి.

కంది.: ఈ పంట సాగు ఆగస్టు 15వరకు విత్తుకునే అవకాశం ఉంది. ఎకరానికి 3-4కిలోల విత్తనాన్ని వాడాలి. భూసారం మేరకు ఎకరానికి 20కిలోల యూరియా, 100కిలోల సింగిల్ సూపర్‌ఫాస్పేట్ ఎరువులను వేసుకోవాలి. పంట పెరిగిన తర్వాత ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వేరుతెగులు ఆశించిన మొక్కలను గమనించి తీసివేయాలి. పూత, కాయ దశాల్లో మారుకా మచ్చల పురుగునివారణకు లీటర్ నీటికి రెండు మిమీ క్లోరోఫైరిపాస్ మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పచ్చపురుగు ఆశిస్తే సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా నివారించుకోవాలి.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



ఖరీఫ్‌లో వర్షాధార పంటలుగా వేరుశనగ, కంది, పత్తి ఆముదం, మొక్క జొన్న, సజ్జ, కొర్ర తదితర పంటలు సాగు చేసుకోవచ్చు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు. పంట సాగు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు.

– సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి, బనగానపల్లె

వాడవాడలా కొలువుదీరిన పీర్లు

కోవెలకుంట్ల: మండల కేంద్రం కోవెలకుంట్లతో పాటు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లోని చావిళ్లలో పీర్లదేవుళ్లు కొలువుదీరారు. 14వ తేదీ నుంచి మూడు రోజులపాటు సరిగెత్తు వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని చిన్నబార్‌ఇమాం, పెద్దబార్‌ఇమాం, ఆంజనేయస్వామి దేవాలయం, రంగరాజుపేట, బాబానగర్, జెండామాను వీధి, సంతపేట, బసిరెడ్డిబావి వీధుల్లో పదిచోట్ల బీబీఫాతిమా, ఇమాంకాశీం, అజరత్ అలీ అక్బర్, చిన్నబార్‌ఇమాం, ఇమాంకాశీం, పెద్దబార్‌ఇమాం, హాజరత్ అబ్బాస్, హాజరత్ అలీ అబ్బాస్, దస్తగిరి స్వామి, మస్తాన్‌వలి, ఉద్దండ ఇమాంకాశీం పీర్లను కొలువుంచారు. ఆదివారం చిన్నసరిగెత్తు, సోమవారం మధ్య సరిగెత్తు, మంగళవారం పెద్ద సరిగెత్తు, 17వ తేదీన పీర్ల నిమజ్జనంతో మొహర్రం వేడుకలు ముగియనున్నాయి.



పెద్దబార్ ఇమాం చావిడిలో కొలువుదీరిన పీర్లు

దోషులను కఠినంగా శిక్షించాలి

కోవెలకుంట్ల: పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడి ఆపై హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సుధాకర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మాబుఉసేన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులతో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి దుండగులను శిక్షించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా ప్రజా సంఘాల నాయకులు వడ్డె సుబ్బరాయుడు, ఓబులేసు, విజయ్, దివ్యాంగుల సంఘం నాయకుడు దేవరాజు పాల్గొన్నారు.



కోవెలకుంట్ల సర్కిల్‌లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు

- పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన మైనర్‌బాలికపై అఘాయిత్యానికి పాల్పడి ఆపై హత్యచేసిన దోషులను ఉరితీయాలని అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోవెలకుంట్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాల చిన్నారిని ఇదే గ్రామానికి చెందిన దుండగులు అత్యాచారం అనంతరం హత్య చేసి నీటి కాల్వలో పడేయడం దుర్మార్గమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

చిన్నారి హత్యకేసులో నిందితులను శిక్షించాలి

డోన్: పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన మైనర్ బాలికను కిరాతకంగా హత్యచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు, జిల్లా వాల్మీకి సంఘం కార్యదర్శి పోస్టుమప్రసాద్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు దొరపల్లె చిరంజీవి డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ బాలికను అత్యాచారం చేసి కిరాతకంగా హత్యచేయడం క్షమించరాని నేరమన్నారు. దుండగులను కఠినంగా శిక్షించాలని, బాలిక కుటుంబానికి రూ.20లక్షలు ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుమప్రసాద్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ శంషాద్‌బేగం



మాట్లాడుతున్న సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ

డోన్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ డోన్ ప్రాజెక్టు సీడీపీఓ శంషాద్‌బేగం హెచ్చరించారు. డోన్ మండలం దొరపల్లె గ్రామంలో మెడికల్ అధికారి చెన్నకేశవులు ఆధ్వర్యంలో గ్రామస్తులకు శుక్రవారం బాల్య వివాహాలు, ప్రభుత్వ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో జంగాల కులస్తులు తమ పిల్లలతో భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మ, పరమేశ్వరి, శకుంతల, అనురాధ, ఈశ్వరమ్మ, దేవకృప, శ్వేతకీర్తి, సంఘ సేవకులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివించాలి

సంజామల: మగపిల్లలతో సమానంగా తల్లిదండ్రులు ఆడ పిల్లలను చదివించాలని సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ సూచించారు. మండల పరిధిలోని గిద్దలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బేటి పడావో బేటి పచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. లింగ వివక్షత, బాల్యవివాహాల నియంత్రణ, కిషోర బాలికల వ్యక్తిగత పరిశ్రుభత తదితర విషయాలను సీడీపీఓ వివరించారు. ఆడపిల్లల చదువుతో ఇంటికే వెలుగు వస్తుందన్నారు. కార్యక్రమంలో పేరుసోముల క్లష్టర్ సూపర్ వైజర్ సుగుణ, అగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

డోన్ టౌన్: వాహనచోదకులు రోడ్డు నిబంధనలు పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంవీఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డు నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం నేరమన్నారు. అదేవిధంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపకూడదన్నారు. వాహనాలు నడిపేవారు ప్రతిక్షణం తమ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డోన్ టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి తంగమణి

ఆదర్శ భావాలు కలిగి ఉండాలి

బనగానపల్లె రూరల్ : యువత ఆదర్శభావాలు కలిగి ఉండాలని, సమాజాభివృద్ధికి పాటుపడాలని ఐడీయల్ యూత్ మూమెంట్(ఐవైఎం రాష్ట్ర కార్యదర్శి షాహనూర్ తెలిపారు. శుక్రవారం స్థానిక జమా అతే ఇస్లామీ హింద్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నబిరసూల్ అధ్యక్షతన ఐవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన 'ఆదర్శ యువత–ఆదర్శ సమాజం' చైతన్య కార్యక్రమం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా షాహనూర్ మాట్లాడుతూ సమాజంలో యువతను ఆదర్శంగా నిలిపేందుకు ఐవైఎం కృషి చేస్తుందన్నారు. సమాజంలో యువత పాత్రపై అవగాహన కల్పిస్తూ ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేది వరకు రాష్ట్వ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా బనగానపల్లె మండలంలోనూ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐవైఎం కార్యకర్తలు వలి, పాషా, స్థానిక జజమాతే ఇస్లామీ హింద్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ



డోన్ : స్థానిక పాతబ స్టాండ్ సమీపంలోని కనకదుర్గ అమ్మవారు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజ లు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి పూలతో విశేష అలంకరణ జరిగింది.

పశుగ్రాసం విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

డోన్ : పశుగ్రాస కొరత నివారణకు 75 శాతం సబ్సిడీతో మేలైన పశుగ్రాస విత్తనాలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాల ని డోన్ ప్రాంతీయ పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నాగరాజు తెలిపారు. వారం రోజుల పా టు జరిగే పశుగ్రాస వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పశువైద్యశాలలో రైతులకు, పశుపోషకులకు పశుగ్రాస విత్తనాలను ఆయన పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తమ పంట పొలంలో 10 శాతం పశుగ్రాసాన్ని సాగుచేసుకుంటే పాడిపంటలతో గ్రామాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. స్థానికంగా డిమాండ్ ఎక్కువగా ఉన్న సీఎస్‌హెచ్24, జొన్న రకం మరియు ఆఫ్రికన్ డాల్ మొక్కజొన్న రకం విత్తనాలను 75 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేశామన్నారు.సంజామల: రైతులు, పాడిరైతులు పశుగ్రాసం సాగులో జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధకశాఖ ఏడి డాక్టర్ మోహన్ రావు సూచించారు. మండల పరిధిలోని గిద్దలూరు గ్రామంలో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సౌకర్యం ఉన్న పాడిరైతులు పచ్చి మేతను సాగు చేసుకోవాలని, పాడిపశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు శివనందారెడ్డి, రఘు, పశువైద్య సిబ్బంది మహబుబ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరీ అలంకారంలో వాసవీమాత



బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో వెలసిన వాసవీమాత ఆశాడమాసం శుక్రవారం శాకాంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ మహిళా మండలి మహిళలు అమ్మవారిని కూరగాయలు, పండ్లతో అలంకరించారు. అర్చకులు పవన్ కుమార్ శర్మ వేద మంత్రాలు చదువుతుండగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చన మహా మంగళహారతి నిర్వహించారు.

ట్రిపుల్‌ఐటీకి విద్యార్థుల ఎంపిక



చల్లా భవ్య శ్రీ, పసుపుల మనోజ్, శ్రీవెంకట శ్రీకాంత్, పోగుల మేఘన, హరిణి, వెంకట ప్రవల్లిక

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదివిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. చల్లా భవ్య శ్రీ,, వెంకట శ్రీకాంత్, పసుపుల మనోజ్, పోగుల మేఘన ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మరియదాసు శుక్రవారం తెలిపారు. మోడల్ స్కూల్ నుంచి నలుగురు విద్యార్థులు ట్రిబుల్ ఐటీకి ఎంపిక కావడం ఇదే మొదటి సారని అని ప్రిన్సిపాల్ సంతోషం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు అభినందించారు.

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారు. కే హరిణి, వై. మహేష్‌బాబు నూజివీడు, అలాగే పి రిషిగణేష్, ఎన్ భానుప్రకాష్, ఆర్ లక్ష్మీప్రసన్న ఆర్కేవ్యాలీ (ఇడుపులపాయ) ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రామలక్ష్మీ శుక్రవారం తెలిపారు. అదేవిధంగా స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు వై శ్వేత, ఎస్ ఫర్‌జనా, జి వెంకటప్రవళ్లిక ఆర్కేవ్యాలీ ట్రిబుల్‌ఐటీకి క్యాంపస్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం బాలగందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులను ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.



ఫర్‌జనా, శ్వేత, రిషిగణేష్, భానుప్రకాష్, మహేష్‌బాబు, లక్ష్మీప్రసన్న

కోలుకోలేక వ్యక్తి మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని శంకరాపురం గ్రామానికి చెందిన నల్ల బోతుల వెంకట్రాముడు ఈనెల7వ తేది రాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. బైక్‌పై వస్తుండగా మోడల్ స్కూలు వద్ద బేతంచెర్ల వైపు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో కర్నూలుకు తరలించగా కోలుకోలేక నల్లబోతుల వెంకటరాముడు మృతి చెందాడు. మృతుని భార్య నల్లబోతుల నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మాసుంబాషా శుక్రవారం తెలిపారు.

డోన్ రూరల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొత్తబురుజు గ్రామానికి చెందిన చిన్నషేకన్న(48) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడని రూరల్ పోలీసులు తెలిపారు. మండల పరిధిలోని దేవరబండ గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్నషేకన్న కర్నూలు ఆసుపత్రిలో చేర్పించారు.

రిటైర్డు ఉపాధ్యాయుడు మృతి

ప్యాపిలి: పట్టణానికి చెందిన రిటైర్డు తెలుగు పండిట్ మాధవరెడ్డి (84) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ప్యాపిలి బాలుర ఉన్నత పాఠశాలలో 1983 నుంచి 1997 వరకు ఆయన సీనియర్ తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేశారు. మాధవరెడ్డి మృతి పట్ల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హనిమిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, స్నేహితులు, పూర్వ విద్యార్థులు సంతాపం తెలిపారు.

న్యాయవాది ఆఫీస్‌పై దాడి

కోవెలకుంట్ల: పట్టణంలోని పాండురంగస్వామి దేవాలయ సమీపంలో ఉన్న న్యాయవాది మధుసూదన్‌రెడ్డి ఆఫీస్‌పై దాడి జరిగింది. శుక్రవారం ఏఎస్‌ఐ రంగయ్య సమాచారం మేరకు.. సివిల్ కేసు వ్యవహారంలో న్యాయవాది జోక్యం చేసుకుంటున్నాడని భావించి కోవెలకుంట్లకు చెందిన శ్రీను అనే వ్యక్తి గురువారం సాయంత్రం న్యాయవాది ఆఫీసు వద్దకు వెళ్లి ఆఫీసు అద్దాలను ధ్వంసం చేశాడు. న్యాయవాది అసిస్టెంట్ భార్గవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

నాటుసారా స్వాధీనం

అవుకు: మండల పరిధిలోని గడ్డమేకులపల్లె గ్రామంలో 260 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. దేవరకొండ చిన్న గంగన్న ఇంటి వద్ద నాటుసారాను నిల్వ ఉంచాడన్న సమాచారం మేరకు హెడ్‌కానిస్టేబుల్ రామయ్య, కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు ప్రదీప్ దాడులు చేశారు. 26 ప్లాస్టిక్ కవర్లలో ఉన్న నాటుసారాను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

డోన్ రూరల్ : సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య డిమాండ్ చేశారు. స్థానిక నక్కిరామన్న భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

టెండర్ల అవకతవకలపై విచారణ చేపట్టాలి

డోన్ టౌన్: ప్యాపిలి, బేతంచెర్ల ఆర్టీసీ బస్టాండ్ మరుగుదొడ్ల టెండర్లలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కోయిలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్, ఎస్‌పి రహిమాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్‌కు వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టెండర్ల విషయంలో పీఓ సత్యనారాయణసింగ్ చేతివాటం ప్రదర్శించారని ఆరోపించారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవా శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకులు ఆధ్వర్యంలో చౌడేశ్వరిదేవికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం సంప్రదాయబద్ధంగా అమ్మవారి పల్లకీ సేవా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

టైలర్స్ అసోసియేషన్ ఏర్పాటు

అవుకు: మండల కేంద్రం అవుకులో శుక్రవారం కాశీవిశ్వనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో టైలర్లు సమావేశమై అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ప్రెసిడెంట్‌గా టైలర్ వెంకట సుబ్బయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా కునుకుంట్ల మద్దిలేటి, సెక్రటరీ, వైస్ సెక్రటరీలుగా మునాఫ్, రామ సుబ్బయ్య, ట్రెజరీగా కంబగిరి రాముడును ఎన్నుకున్నారు. టైలర్ల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేస్తానని ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మౌలాలి, బాలయ్య, కుమార్, పవన్, కళాధర్, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



టైలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌కు అభినందనలు తెలుపుతున్న సభ్యులు